# జి.కె.

ఆ ఉద్యోగంలో సెలెక్టు కాని వాళ్లలో ఎంకాం గోల్డు మెడలిస్టు గోవిందరావు ఒకడు. కంటికి కనబడనిది అంటే దృష్టం కానిది అదృష్టం. ఆ అదృష్టం ఎవరిని ఎలా వరిస్తుందో ఎవరు చెప్పగలరు? ఎంత ప్రతిభా పాటవాలున్నా అదృష్టం కూడా కలిసి రావాలి. సెలెక్టయిన అదృష్టవంతులలో సాధారణ గ్రాడ్యుయేట్ జి.కె. అంటే జి.కేశవరావు ఒకడు. గోల్డు మెడలిస్టు గోవిందరావు తన బెస్ట్ ఫ్రెండ్‌తో తన గోడు వెళ్లగ్రక్కేడు. "ఇది న్యాయానికి కాలం కాదయ్యా! కించిత్తయినా న్యాయం ఉంటుందని నేను భావించాను. కానీ అది నాభ్రమ మాత్రమే. క్లాస్ వన్ పబ్లిక్‌స్కూల్లో చదివి, ఎంకాంలో యూనివర్శిటీ ఫస్ట్ సాధించి, గోల్డు మెడల్ కొట్టినవాడిని. ఆఫ్టరాల్ ఒక బ్యాంకు ఆఫీసర్‌గా నేను సెలక్టుకాలేదంటే, నాకే కాదు, ఆ యూనివర్శిటికే తీరని అవమానం! నేను తీసుకున్న ఇంటెన్సివ్ కోచింగ్ సెంటర్‌కి అవమానం! ఆ బ్యాంకుకి నా సేవలు పొందే అదృష్టం లేదు. ఇదంతా కలికాలం. ఆ అవతారపురుషుడు ఎప్పుడవతరించి ఈ ఓరల్ ఇంటర్‌వ్యూ చేసిన దుష్టుల్ని ఖండిస్తాడో ఏమో! లేకపోతే ఓ సాధారణ గ్రాడ్యుయేట్‌ని ఇంటర్‌వ్యూలో సెలెక్ట్ చేస్తారా? వాడు ఆ కమిటీవాళ్లకి ఎంత ముట్టజెప్పాడో?"

"ఇంటర్‌వ్యూలో కమిటీ వాళ్లు ఏం ప్రశ్నలు వేసేరయ్యా" అడిగేడు ఫ్రెండు. "నా చదువుతో సంబంధం లేని రొడ్డగొట్టు ప్రశ్నలు చొప్పదంటు ప్రశ్నలు వేసేరు. నా జి.కె.ని పరీక్షించడంట! దేశంలో ఎన్నో ఆటల పోటీలు జరుగుతుంటాయి. ఆటలన్నీ ముందుకు చొరవ తీసుకుని ఆడే ఆటలే! ఫుట్‌బాల్-ముందుకి బంతిని తన్నుకుంటూ ఆడే ఆట. అలాగే టెన్నిస్ బ్యాడ్‌మింటన్ వాలీబాల్ బాస్కెట్‌బాల్ అన్నీ బంతిని ముందుకి తన్నుకుంటూ తోసుకుంటూ పోయే ఆటలే! ఇహ పరుగుపందెం, ముందుకి పరుగుపెట్టేదే! క్రికెట్, ముందుకు బ్యాట్‌తో కొట్టేది! కానీ ఒకే ఒక్క ఆట-అదే 'వెనక్కి' వెళ్లే ఆట-వుంది అదేమిటి? అని అడిగేరు-అన్నాడు గోవిందరావు. "నువ్వు ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయేవన్నమాట" అన్నాడు ఫ్రెండు. "అన్ని ప్రశ్నలకు జవాబు చెప్పగలిగేను. కాని అదొక్కటే చెప్పలేకపోయాను. అంత మాత్రం చేత నన్ను సెలెక్టు చెయ్యకుండా ఆ జి.కె. గాణ్ని అంటే జి. కేశవరావు అధైనా దుంపల బడిలో చదివిన వాణ్ని సెలెక్ట్ చేయడం ఆ చదువుల తల్లికే అవమానం!" అన్నాడు గోవిందరావు.

"ఏమిటయ్యా! నువ్వు చెప్పలేని ఆ వెనక్కి వెళ్లే ఆటకి సంబంధించిన ప్రశ్న. ఆ జి.కె.గాడు చెప్పిన జవాబు?"

"టగ్ ఆఫ్ వార్" అన్నాడు గోవిందరావు.

"అంటే ఆ జికెగాడికి వున్నది జనరల్ నాలెడ్జి నీకున్నది జనరల్ క్నాలెడ్జి. అందుకే నిన్ను అపజయం వరించింది" అన్నాడా ఫ్రెండు.

16-3-2000

ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక